క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



బాబుల్‌రెడ్డినగర్‌లో చెత్త జీవీపీ వద్ద ముగ్గులు వేసి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మాజీ వార్డు సభ్యుడు సోమ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో జీవీపీ ప్రోగ్రాం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ పాయింట్‌ను శుభ్రం చేయించి కార్మికుల చేత ముగ్గులు వేయించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యం తమ ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు వ్యర్థాలను అందించాలని సూచించారు. నవీన్, రిసోర్స్ పర్సన్ హేమలత, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ జైప్రకాష్, శంకర్, యాదమ్మ, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత



బాధితుడికి బ్యాగును అందజేస్తున్న ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు

శంషాబాద్: విమానాశ్రయంలో పోగొట్టుకున్న లగేజీ బ్యాగును పోలీసులు గుర్తించి సదరు ప్రయాణికుడికి అందజేశారు. విదేశాల నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. అనంతరం తన లగేజీ కనిపించకపోవడంతో వెంటనే ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు సీసీ టీవీల పుటేజీలను పరిశీలించి 20 నిమిషాల వ్యవధిలో ఆ లగేజీ బ్యాగును గుర్తించి ఫిర్యాదుదారుడికి అందజేశారు. సత్వర ఫిర్యాదులో మెరుగైన పరిష్కారం లభిస్తుందని ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య స్పష్టం చేశారు.

'దైవభక్తితో సన్మార్గం వైపు పయనించవచ్చు'

గోల్కొండ: దైవభక్తితో సన్మార్గం వైపు పయనించవచ్చునని ఆఫీజ్ రహమత్ ఉల్లా తయ్యబ్ అన్నారు. సోమవారం షేక్‌పేట్ తేజా కాలనీలోని అన్సారీ మసీదులో హత్‌మే నుబువత్‌పై ఒకరోజు వర్క్ షాప్ జరిగింది. మజ్లిస్ తహఫూజ్ హత్‌మే నుబువత్ టోలిచౌకీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక విషయాలు నమాజ్ చదవడం, మహ్మద్ ప్రవక్త జీవితంపై ప్రవచనాలు లాంటి కార్యక్రమాలు నేటి యువతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అజ్రత్ మౌలానా షా మహ్మద్, జమాల్ ఉర్ రహమాన్, మౌలానా మహ్మద్ అర్షద్ అలీ, మౌలానా మహ్మద్ మూసాఖాన్ నద్వీ, మౌలానా సయ్యద్ ఎంహెచ్ ఉసామీ, మహ్మద్ ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి



గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో సంస్థాగత కమిటీల ఏర్పాటుపై పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్ కమిటీలు, మోర్చా కమిటీలు, బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి స్థితిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీని బస్తీ స్థాయి నుంచి పూర్తిగా పటిష్టం చేసి ఏ ఎన్నికలు వచ్చినా విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇప్పటికీ ఇంకా వేయని కమిటీలను అన్ని స్థాయిలో పూర్తి చేసి ఎన్నికల సంసిద్ధులను చేయాలని ఆయన సూచించారు. పార్టీ, ఇతర స్థాయి కమిటీలు పటిష్టంగా ఉంటేనే పార్టీ సంస్థాగతంగా పటిష్టంగా ఏర్పడుతుందన్నారు. పార్టీ విస్తరణ కోసం క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపుపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహిపాల్ రెడ్డి, రాధాకృష్ణయాదవ్, మూల అనీల్‌గౌడ్, స్రవంతి, దుర్గాప్రసాద్, మాణిక్ రావు, కృష్ణంరాజు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తూట్లు!



పీరంచెరువులో నిమజ్జనం చేసిన బతుకమ్మలు

బతుకమ్మ పండుగ తరువాత వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం

- పూలు కుళ్లి దుర్గంధ భరితంగా చెరువు పరిసరాలు
- ప్రమాదపుటంచుల్లో పీరంచెరువులోని పక్షులు

బండ్లగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబురాలు ముగిశాయి. కనుల పండువగా అలంకరించిన బతుకమ్మలను ఆటపాటలు, ఆనందోత్సాహాలు, ప్రత్యేక పూజల నడుమ మహిళలు చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. రంగురంగుల పూలు నీటిలో తేలి చెరువంతా అందంగా కనిపించింది. అయితే ఇప్పటి వరకు చెరువులో నిమజ్జనం చేసిన పూలను సంబంధిత యంత్రాంగం తొలగించక పోవడంతో ఆ పూలు కుళ్లి చెరువు పరిసర ప్రాంతాలు దుర్గంధ భరితంగా తయారవుతున్నాయి. దీంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిమజ్జన సమయంలో రకరకాల పూలతో పాటు పూలు పేర్చిన ట్రేలు, ఆకులు ప్లాస్టిక్, తదితర వ్యర్థాలను పెద్ద సంఖ్యలో పీరంచెరువులో వేశారు. పూలను నిమజ్జనం చేయడం ప్రకృతికి సమర్పణ. అయితే వాటిని శుభ్రం చేయడం అనే బాధ్యత మరిచారు. కొందరు పండుగ తరువాత ఇంట్లోని చెత్తను సంచుల్లో తీసుకొచ్చి చెరువు చుట్టు పక్కల వేస్తున్నారు.

నీటిలో పూలు ఎక్కువ రోజులు ఉండటంతో...

పూలు సహజమైనవే అయినా ఎక్కువ రోజులు నీటిలో ఉండటం వల్ల చెరువులో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిడంతో చెరువులో ఉన్న చేపలు, నివాసముంటున్న పక్షులు చనిపోయే ప్రమాదం ఉంది. స్వచ్ఛంద సేవా సంఘాలు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది కలిసి చెరువులో నిమజ్జన చేసిన పూలు కుళ్లిపోయి నీటి కాలుష్యానికి కారణం కాకుండా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో 120 రకాల పక్షి జాతులు

పీరంచెరువులో 120 రకాల పక్షి జాతులు నివాసముంటున్నట్టుగా గతంలో పక్షి ప్రేమికులు చేసిన సర్వేలో తెలిపారు. అందులో అరుదైన పక్షులు కూడా ఉన్నాయి. చాతక పక్షి, నీలి ముఖం గల మాల్కోహా, దామరకోడి, తీతువు పిట్ట, యర్ర కళ్ల కొంగ, చిన్న తెల్ల కొంగ, లకుముకి పిట్ట, నారాయణ పక్షి, జెముడు కాకి, నామాలకోడి తదితర పక్షి జాతులు ఉన్నాయి.

కిలకిలరావాలతో ఆహ్లాదాన్ని పంచుతూ...

ఉభయ సంధ్య వేళల్లో చెరువు.. పరిసరాల్లో పక్షుల కిలకిలరావాలతో ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అంతరించిపోతున్న పక్షులను కాపాడేందుకు చెరువులో ఆపరేషన్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టి చెరువును స్వచ్ఛంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు వద్ద వ్యర్థాల మూటలు





పీరంచెరువులోని పక్షులు

మిస్టర్ ఇండియా విజేతకు సన్మానం



రాజేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మిస్టర్ ఇండియా 2025 టైటిల్ విన్నర్‌గా నిలిచిన తెలంగాణ యువకుడు రాకేష్ ఆర్నెను సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయికి, ఇప్పుడు ప్రేరణాత్మక ప్రయాణం సాగించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు రాకేష్ ఆర్నె మిస్టర్ ఇండియా 2025 టైటిల్‌ను గెలుచుకోని రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ఈ ప్రతిష్టాత్మక టైటిల్ ఫినాలే గోవాలోని గోల్డెన్ క్రౌన్ రిసార్ట్స్‌లో ఇటీవల ఘనంగా నిర్వహించారని తెలిపారు. బాబుల్‌రెడ్డినగర్‌లో నివాసించే రాకేష్ మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చాడన్నారు. రాకేష్ మలేషియాలో జరిగిన మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు పొందారని ఎమ్మెల్యే అభినందించారు. డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, నేతలు సోమ శ్రీనివాస్, ప్రేమ్‌గౌడ్, కిషోర్, గట్టయ్య, మల్లేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

9, 11వ తేదీల్లో మండల స్థాయి ఖోఖో సెలక్షన్స్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ నెల 9వ తేదీన కబడ్డీ, వాలీబాల్, 11న ఖోఖో మండలస్థాయి టోర్నమెంట్స్, సెలక్షన్‌ను ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జోనల్ ఇన్‌చార్జి గాంగ్యా నాయక్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను మండల ఎంఈవో శంకర్ రాథోడ్, శివరాంపల్లి హెచ్‌ఎం భూక్య శ్రీను నాయక్‌లు ప్రారంభిస్తారన్నారు. అండర్-14లో పాల్గొనాలన్నారు. 1-1-2012 లోపు జన్మించి ఉండాలని... అండర్-17 పోటీల్లో పాల్గొనాలంటే 1-1-2009 లోపు జన్మించి ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. బోనఫైడ్, ఆధార్ జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీడీలు జ్యోతి, బాలస్వామి రెడ్డి, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు. వివరాలకు ఫోన్: 98804 99993లో సంప్రదించాలన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి

రాజేంద్రనగర్: భారీ వర్షాల కారణంగా గుంతలమయంగా తయారైన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్ అధికారులను కోరారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలు పూర్తిగా గోతులమయంగా మారాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో నడిచేందుకు సైతం ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రధాన రహదారులే ఇలా ఉంటే అంతర్గత బస్తీల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్యాచ్‌వర్క్ పనులను త్వరితగతిన నిర్వహించిన స్థానిక ప్రాంతాల ప్రజలతో పాటు వాహనదారుల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షం కారణంగా రోడ్లు గోతులమయంగా మారాయన్నారు. వాటికి తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు.

బ్లాక్ స్థాయి అధికారులకు శిక్షణ



ఎన్‌ఐఆర్‌డీపీలో శిక్షణలో పాల్గొన్న బ్లాక్ స్థాయి అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌లో దేశవ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్థాయి అధికారులకు నీతి ఆయోగ్ సహకారంతో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఏబీపీ) ట్రెనింగ్ కార్యక్రమాన్ని సోమవారం ఎన్‌ఐడీపీఆర్ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రకుమార్, నీతిఆయోగ్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీపీ లక్ష్యాలు, దిశానిర్దేశం గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాక్‌లను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు బ్లాక్ స్థాయి అధికారుల సామర్థ్యాలను పెంచి కీలక పనితీరును మెరుగు పరచడమే కార్యక్రమ లక్ష్యమని వెల్లడించారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాలలో ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, సామాజిక అభివృద్ధి రంగాలలో కీలక మార్పులు తీసుకరావడం కోసం శిక్షణలో సూచనలు ఇస్తారని అన్నారు. ఇందులో ఫీల్డ్ అధికారుల ప్రాత కీలకమని ఇందులో కన్వర్జెన్స్, ఇన్నోవేషన్, సూక్ష్మస్థాయి ప్రణాళిక సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. ఉత్తమ ఆచరణలను పురరావృతం చేయడం స్థానిక పాలన బలపరచడం ద్వారా వికసిత్ భారత్ 2047 దిశగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. శిక్షణ నవంబర్ 20 వరకు ఉంటుందని.. 126 బ్యాచ్లలో మొత్తం 5 వేల మంది బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇరు సంస్థల అధికారులు పాల్గొన్నారు.

రూ. 81 వేలకు దుర్గామాత పట్టు చీర వేలం



వెంకటేష్‌రాధిక దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని శ్రీ శివ మార్కండేయ సీతారామాంజనేయ ఆలయ ప్రాంగణంలో పద్మజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల్లో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారికి అలంకరించిన పట్టుచీరను సోమవారం నిర్వాహకులు వేల వేశారు. ఆ పట్టుచీరను బొల్లా వెంకటేష్‌రాధిక దంపతులు రూ. 81 వేలకు దక్కించుకున్నారు. వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించి అమ్మవారి పట్టుచీరను అందించారు.

రూ. 1.35 లక్షలకు అమ్మవారి వెండి కలశం...

మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలీపురంలోని శివ మార్కండేయ సీతారామాంజనేయ స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద పూజలు అందుకున్న కలశాన్ని ఆదివారం రాత్రి వేలంపాట నిర్వహించారు. పద్మజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 15 తులాల వెండి కలశం వేలం పాటలో యంజాల మహేష్‌రాజ్‌మాధవి దంపతులు రూ. 1.35 లక్షలకు కలశాన్ని దక్కించుకున్నారు. వసరుగా 12వ సారి వారు దక్కించుకోవడంతో నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ రూరల్: ఇళ్లకు అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్లను అధికారులు సోమవారం తొలగించారు. శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ పంచాయతీలోని పలు కాలనీల్లో విద్యుత్ అక్రమ వినియోగంపై 'యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం?' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆఫీసర్స్ కాలనీలో 8 అక్రమ కనెక్షన్లు, మరో కాలనీలో 3 అక్రమ కనెక్షన్లను తొలగించారు. అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వారి వివరాలు సేకరించి కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు.



చౌదరిగూడ పంచాయతీ ఆఫీసర్స్ కాలనీలో విద్యుత్ అక్రమ కనెక్షను తొలగిస్తున్న సిబ్బంది

'మజిల్ మానియా-2025'లో ఓంకార్‌కు బంగారు పతకం



రాయదుర్గం: మజిల్ మానియా-2025 చాంపియన్‌షిప్ పోటీల్లో రాయదుర్గంలోని శ్యాంలేట్ వీధివాసికి బంగారు పతకం పొందారు. ఆదివారం నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీ (మజిల్ మానియా)లో సత్తాచాటిన శ్యాంలేట్ ఓంకార్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించడం విశేషం. ఆలిండియా రెజ్లింగ్ చాంపియన్ శ్యాంలేట్ పాండు కుమారుడు ఓంకార్ అదే రంగంలో రాణించడం మరో విశేషం. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మొదటి స్థానంలో నిలువడం, బంగారు పతకాన్ని బస్తీవాసి సాధించడంపై శ్యాంలేట్ వీధివాసులు సంతోషం వ్యక్తం చేసి ఓంకార్‌ను అభినందించారు.

కాలనీల్లోనూ ట్రాఫిక్ జాం

- రెండు రోజులుగా ఖాళీగా రోడ్లు
- సోమవారం నిండిపోయిన రోడ్లు
- ఇబ్బందుల్లో కాలనీల ప్రజలు

మణికొండ: ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. ట్రాఫిక్ జాంలు తప్ప.. అనే తీరున మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు తయారవుతున్నాయి. దసరా పండగను పురస్కరించుకొని స్థానికులు చాలా మంది స్వస్థలాలకు వెళ్లటం, ఉద్యోగాలకు సెలవులు ఉండటంతో ఆదివారం వరకు గృహాలకు ప్రజలకు పరిమితం అయ్యారు. దాంతో ఏ రోడ్డు చూసినా ఖాళీగా కనిపించింది. సోమవారం ఉదయం పాఠశాలలు తెరచుకోవటం, ఉద్యోగాలకు వెళ్లాల్సి రావటంతో ఒక్కసారిగా అందరూ తమ వాహనాల్లో బయటకు వచ్చారు. అదే సమయంలో భారీ వర్షం సైతం కురవటంతో మున్సిపాలిటీల పరిధిలోని వినాయకనగర్, మణికొండ ఉన్నత పాఠశాల చౌరస్తా, అంజలిగార్డన్స్, లక్ష్మీనగర్ కాలనీ, మణికొండ మర్రిచెట్టు సర్కిల్ ప్రాంతాలు ఒక్కసారిగా వాహనాలతో కిటకిటలాడి ట్రాఫిక్ జాం నెలకొంది. దాంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ జాంలను నివారించేందుకు లింక్ రోడ్ల ఏర్పాటు, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్‌లు, ట్రాఫిక్ కానిస్టేబుల్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అంజలిగార్డన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

సన్మానం



బెన్నీ జోసెఫ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ఆడిట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ (గ్రూప్-1 సర్వీసెస్)గా ఇటీవల ఎంపికైన బెన్నీ జోసెఫ్‌ను అభ్యుదయనగర్ కాలనీ వాసులు సోమవారం ఘనంగా సన్మానించారు. లక్ష్యాన్ని సాధించడంలో తన కృషి, నిబద్ధత, తల్లిదండ్రులు, స్నేహితుల నుంచి పొందిన ప్రేరణను ఆయన గుర్తు చేశారు. సీనియర్ నాయకులు నరేందర్ నాగుల, ప్రముఖ సామాజిక వేత్త నరేందర్‌బాబు, సుదర్శన్, థామస్, మార్క్, చంటి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

హుక్కా సేవిస్తున్న 10 మంది అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురంలో అర్ధరాత్రి పోలీసులు హుక్కా సేవిస్తున్న ఇంటిపై దాడి చేశారు. ఎస్ఐ అబ్దుల్లా సమాచారం మేరకు... షంషేర్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా ఇంట్లో కొంత మందితో హుక్కా సేవిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి ఇంటిపై దాడి చేసి హుక్కా పాట్స్, సెల్‌ఫోన్లతో పాటు పది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

వాహనాల బ్యాటరీలు చోరీ

మణికొండ: కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో నిలిపిన వాహనాల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మణికొండ మున్సిపాలిటీ శ్రీరాంనగర్ కాలనీలో రెండు రోజులుగా కాలనీలోని ఖాళీ స్థలాల్లో టాటా ఏస్, డీసీఎం వాహనాలకు పూజలు చేసి నిలిపి ఉంచారు. సోమవారం ఉదయం చూసే సరికి వాటి బ్యాటరీలను దొంగిలించారని బాధితులు గుర్తించారు. కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవటంతో వారిని గుర్తించేందుకు వీలు పడటం లేదని, సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. బ్యాటరీ దొంగలపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశామని వాహనదారులు తెలిపారు.

ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయాలి

'నిథమ్'డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ

రాయదుర్గం: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలని 'నిథమ్'డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ-మాలవ్యా మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ), 'మనూ'లోని వాణిజ్య, నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు కొనసాగే రిఫ్రెషర్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార, నిర్వహణ విద్య డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణ, స్థిరత్వం ద్వారా పునర్నిర్వచిస్తున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ నసీమ్ ఫాతిమా మాట్లాడుతూ ఉన్నత విద్యలో నిరంతర అభ్యాసం, విద్యా పునరుద్ధరణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ రజౌల్లాఖాన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, యూజీసీ- ఎంఎంటీటీసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్ ముబార్కి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సైదలావి ప్రసంగించారు.



టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారితో నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ